క్లుప్తంగా

కిశోర్‌కుమార్‌కు విశిష్ట సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్: నీలగిరి పట్టణానికి చెందిన ఆర్ముడు రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ దంపతులకు పుడమి సాహితీ వేదిక, పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారం దక్కింది. ఖమ్మం జిల్లా ముదిగొండలో సోమవారం రాత్రి జరిగిన పుడమి సాహితీ వేదిక ఆరో వార్షికోత్సవంలో వేదిక ప్రతినిధుల చేతుల మీదుగా కిశోర్ కుమార్ దంపతులు పురస్కారం అందుకున్నారు. వివిధ సేవా కార్యక్రమాలతో పాటు కళాకారునిగా కళా రంగానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారం అందజేసింది. కార్యక్రమంలో వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, పద్మశ్రీ వనజీవిని రామయ్య, కంచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ చిలుముల హైమావతి, నేరేళ్ల శ్రీనివాస్‌రావు,అన్నం శ్రీనివాసరావు, జానిపాష, కత్తుల హరి, కిరణ్మయి, పద్మావతి, వెంకట రమణ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

నల్లగొండటౌన్: సీపీఐ శత వసంతాల సంబరాల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో వైభవంగా నిర్వహించిన బహిరంగ సభకు తరలివచ్చి విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు, అన్ని వర్గాల ప్రజలకు సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బహిరంగ సభకు ముందు గడియారం నుంచి ఎన్జీ కాలేజీ వరకు కవాతు ప్రదర్శన నిర్వహించిన కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు.

నీలగిరి న్యూ ఇయర్ సాంగ్ విడుదల



నీలగిరి న్యూఇయర్ సాంగ్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణానికి చెందిన రచయిత, గాయకుడు ముశం శ్రీనివాస్ పాడిన 'నీలగిరి న్యూఇయర్ సాంగ్'ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరం సందర్భంగా నీలగిరి న్యూ ఇయర్ సాంగ్ పాడడం ఎంతో అభినందనీయమన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిపై కొత్తగా పాటలు పాడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముశం మిర్యాల స్వామి, 5వ కౌన్సిలర్ పున్న గణేష్ పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ సీఐగా రాఘవరావు



నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ టూటౌన్, నల్లగొండ రూరల్ సీఐగా రాఘవరావును నియమిస్తూ ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాఘవరావు ఇప్పటి వరకు ఎస్పీ కార్యాలయం డీఎస్‌బీ విభాగంలో విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ డానియెల్‌పై ఓ మహిళ భర్త ఫిర్యాదు చేయడంతో మల్టీజోన్ 2కు అటాచ్ చేశారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా అరుణ



చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామ యూపీఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బడుగు అరుణ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా నల్లగొండలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర మహాసభలో ఎన్నికైనట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అరుణ ఎన్నిక పట్ల చిట్యాల మండల ఆ సంఘం అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య, ప్రధానకార్యదర్శి గడగోజు సతీష్, ఉపాధ్యాక్షులు రంగా రామలింగయ్య, ఎం.జానకి హర్షం వ్యక్తం చేశారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న అయితగోని శ్రీనివాస్

కనగల్ : దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయానికి మండల పరిధిలోని దోరెపల్లి గ్రామానికి చెందిన అయిత గోని శ్రీనివాస్ గౌడ్(పాల శ్రీను) రూ.లక్ష విరాళాన్ని మంగళవారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అయితగోని యాదయ్య గౌడ్, లింగోటం మాజీ సర్పంచ్ అవ్వరేషి క్రాంతి శ్రీనివాస్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వర్ రావు, జూనియర్ అసిస్టెంట్ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌కు రూ.1,228 కోట్లు తెచ్చాం

- నూతన సంవత్సరంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం
- బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు, అయిటిపాముల లిఫ్ట్ పనులు పూర్తి చేస్తాం
- అడ్డంకులు ఎదురైనా మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామనిఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో పాలన కుంటుపడిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.1,228 తీసుకువచ్చి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. గడిచిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. నియోజకవర్గంలోని 80శాతం రైతాంగం మూసీ నీటిపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు అడ్డుతగులుతున్నా మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వివరించారు.

సాగునీటి రంగానికి ప్రాధాన్యం

నకిరేకల్ నియోజకవర్గానికి ఏడాది కాలంలో ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.1,238కోట్ల 57 లక్షలు నిధులు తెచ్చామని తెలిపారు. ప్రధానంగా పిలాయిపల్లికి రూ.86.22కోట్లు, ధర్మారెడ్డి కాల్వలకు రూ.123 కోట్లు, అయిటిపాముల లిఫ్ట్‌కు రూ.101.26 కోట్లు మంజూరు చేస్తూ తాజాగా ప్రభుత్వం జీఓలు జారీ చేసిందని తెలిపారు. మరో రూ.33.26 కోట్లతో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. సాగునీటి రంగానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వివిధ అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

ఈ ఏడాదిలో నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల భవననిర్మాణం, రోడ్డు విస్తరణ, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు బ్రాహ్మణవెల్లంల, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ, అయిటిపాముల లిఫ్ట్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రవాణా వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు కోతుల బెడదను నివారిస్తామని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, నకిరేకల్ మార్కెట్ చైర్ పర్సన్ గుత్తా మంజుల, నకిరేకల్, చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్లు చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఉశయ్య, కంపసాటి శ్రీనివాస్, మల్లారెడ్డి, కాటం వెంకన్న, దూదిమెట్ల సత్తయ్య, లక్ష్మీనర్సు, చిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

రామగిరి (నల్లగొండ) : రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ పట్టణం పాతబస్తీలోని అంభయాంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం రూ.5లక్షల విరాళం అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరగోని రాజయ్య, కార్యదర్శి బండారు ప్రసాద్, సభ్యులు సతీష్, గుండెబోయిన వెంకన్న, మద్ది శ్రీనివాస్, కస్పరాజు వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జీవించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ కోసం కష్టపడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: 2025–నూతన సంవత్సరం సందర్భంగా పట్టణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని,సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం



నల్లగొండలో సుభాష్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో దళిత ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిచేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున పేర్కొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులను పూజించాల్సింది పోయి దాడి చేసి కాళ్లు మొక్కించుకోవడం అనాగరిక చర్య అన్నారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దేశంలో మతోన్మాదుల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారి ఐలయ్య, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, పుచ్చకాయల నర్సిరెడ్డి, గాదె నరసింహ, బొల్లు రవీందర్, కొండ వెంకన్న, నలపరాజు సైదులు, భిక్షం, రవీందర్, గోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

నకిరేకల్ : తుక్కుగూడలో దళిత ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య అనిన కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేపాక కృష్ణ అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన కేవీపీఎస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, మతం, భక్తి ముసుగులో మతోన్మాద శక్తులు దాడులకు పాలడుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి దాడులను సామాజిక ప్రజాసంఘవాదులు ఖండించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాయకులు వంగూరి వెంకన్న, బుచ్చిరాములు, లింగయ్య, నాగయ్య, నాగర్జున, జమదగ్ని బక్కయ్య పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ గోదాం ఎదుట నిరసన

నల్లగొండ టౌన్: రెండేళ్లకు ఒకసారి జరిగే సివిల్ సప్లయీస్ రేట్ల ఒప్పందం ముగిసి ఏడాది దాటినా పెరిగిన రేట్ల జీఓ విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని సివిల్ సప్లయీస్ గోదాం పాయింట్ వద్ద జరిగిన హమాలీ కార్మికుల నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరిగిన రేట్ల జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొనకొండ వెంకటేశ్వర్లు బుచ్చయ్య, జానయ్య, సైదులు ,శ్రీను, సోమయ్య ఎల్లయ్య, లింగస్వామి, రామస్వామి, యాదయ్య, సోమయ్య, గిరి జాని పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు షరతులు విధించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నారి ఐలయ్య

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులందరికీ ఏడాదిరి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు అమలులో షరతులు విధించడం సరికాదని ఆ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.12వేలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వేంకులు, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య, నాయకులు కాశీరాం, కారింగుల యాదగిరి, వంటిపాక వెంకటేశ్వర్లు, వంటిపాక కృష్ణ, మక్కా బుచ్చిరాములు, డెంకల లింగయ్య, వంగూరి వెంకన్న, ఆదిమల్ల నాగయ్య, వంగురి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రూ.12 వేలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు దండంపల్లి సరోజ, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, గంజి మురళీధర్, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చండూరు స్టేషన్‌లో పరికరాలను పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

చండూరు : పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన చండూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంట సీఐ వెంకట్, ఎస్‌ఐ వెంకన్న, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

కనగల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

కనగల్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ శివరాంరెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విష్ణుమూర్తి, సీఐ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు డీఎస్పీ దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.

క్రీడా సామగ్రి అందజేత

చండూరు : చండూరు మండలం బోడంగిపర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ సభ్యులు రేపాల మోహన్ రూ.10వేల విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పిచ్చయ్య, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు గంగాధర్, శ్యాం కుమార్, చాక్ సింగ్, గంట ప్రసాద్, అషిక ఉన్నారు.

బీసీ యువజన సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్

నల్లగొండ టౌన్: బీసీల అభ్యున్నతికి యువకులను నియమించటం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. ఆయన మంగళవారం నల్లగొండలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గోలి విజయకుమార్‌ను సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ ,కాసోజు విశ్వనాథం, కాశయ్య గౌడ్, కంది సూర్యనారాయణ, కేశ బోయిన శంకర్, చిక్కుల రాములు, గంజి భిక్షమయ్య , పసుపులేటి సీతారాములు, జిల్లా ఆదినారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా

సంక్షిప్త సమాచారం

చిట్యాల పట్టణానికి చెందిన గుత్తా యువసేనా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలోని ఆదరణ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తేరటుపల్లి హన్మంతు, రంగా వెంకటేశ్వర్లు, శీలా సత్యనారాయణ, గజ్జెల భాస్కర్, ఏళ్ల శేఖర్, కొండూరు నారాయణ, మర్ల రవీందర్‌రెడ్డి, వేలుపల్లి సందీప్ పాల్గొన్నారు.

ఉరుమడ్లలో..

మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గుత్తా అమిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు కోనేటి యాదగిరి, నాయకులు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్దన్, జన్నపాల శ్రీను, మర్రి రమేష్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

తిప్పర్తి : తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడేనికి చెందిన సీపీఎం నాయకుడు మాలి ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి సందర్శించి నివాళర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వెంట మన్నె భిక్షం ఉన్నారు.

పౌర హక్కులను వినియోగించుకోవాలి

మునుగోడు: ప్రభుత్వం ప్రజలకు కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని గూడపూర్ గ్రామంలోని దళిత కాలనీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పౌర హక్కుల గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌ఐ రామచంద్రయ్య ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మర్రిగూడ: టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.వెంకటేశంగౌడ్‌తో కలిసి సంఘం జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్.శ్రీనివాస్‌రావు, బండారు గోవర్ధన్, ఎస్.వెంకటయ్య, రజీయొద్దీన్, విజయ, సబిత, కోమలి, అనురాధా, సూర్యకుమారి, లింగస్వామి, రాజు, రామ్‌నరేష్ పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాలలపై చర్య తీసుకోవాలి

నల్లగొండ: గుర్తింపు లేకుండా నడిపిస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళికృష్ణ మంగళవారం డీఐఈవో దస్రూనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గాదెపాక సూర్యతేజ, సిలువేరు రాము, సతీష్, మహేష్ ఉన్నారు.

'నూతన' జోష్



నల్లగొండ: విద్యుత్ వెలుగుల్లో దేవరకొండ రోడ్డులోని మరియారాణి చర్చి



గంధంవారిగూడెంలో కేక్ కట్ చేస్తున్నచిన్నారులు



మిఠాయిలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నల్లగొండ : ఎస్సీ బాలికల వసతి గృహంలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు



నల్లగొండ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు, పర్యవేక్షిస్తున్న డీఎస్పీ

చిట్యాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను చిట్యాలలో ఏర్పాటు చేయాలని కోరుతూ మండల అఖిల పక్ష పార్టీల నాయకులు మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. చిట్యాల మండలంలో ఇప్పటి వరకు ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు చేయనందున ప్రస్తుతం మంజూరైన ఇంటర్నేషనల్ స్కూల్‌ను కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వినతి పత్రాన్ని అందజేసిన వారిలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు చికిలంమెట్ల అశోక్, కన్నబోయిన మహాలింగం, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి శంకర్, ఎరసాని గోపాల్, స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి రుద్రవరం సునిల్, బీఎస్పీ నాయకులు గ్యార మారయ్య, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, మారగోని అంజనేయులు, పోకల యేసురత్నం, జిట్ట చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నకిరేకల్ : నకిరేకల్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యానాల కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టేటి కృష్ణయ్య, ప్రతినిధులు బిచేపల్లి ప్రకాష్‌రావు, నర్సింహారెడ్డి, బృగు మహర్షి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడుస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట రోడ్డు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ టౌన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిరసనలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మొలుగూరి కృష్ణ, బొమ్మగానిరాజు, మురళీకృష్ణ, సూర్యతేజ, చంద్రశేఖర్, నీలాంబరి, మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిలు, వసంత, సుజాత, పాండునాయక్, యాదయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలి



కాళిదాసు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది



నల్లగొండ : దమనేశ్వరరావును సన్మానిస్తున్న డీఈఓ భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఉద్యోగ విరమణ పొందిన వారు సమాజ సేవలో భాగస్వాములు కావాలని డీఈఓ భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణం పద్మనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నవ్వ దమనేశ్వర్‌రావు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డీఈఓ, మున్సిపల్ చైర్మన్, పలువురు ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం ధనలక్ష్మి, వెంకన్న, పున్న గణేష్, మాజీ కౌన్సిలర్ మిర్యాల యాదగిరి, కుటుంబ సభ్యులు లలిత, ఆకుల బాలకృష్ణ, ఇందిర, నవ్వ సునీల్ కుమార్, డాక్టర్ సుజల పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితం కావాలి

నల్లగొండ రూరల్: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రజా సేవకు అంకితం కావాలని ప్రజారోగ్య శాఖ డీఈ సత్యనారాయణ అన్నారు. ప్రజారోగ్య శాఖలో 36 ఏళ్లుగా సబార్డినేటర్‌గా విధులు నిర్వహించిన మారోజు కాళిదాస్–రాధ దంపతులను మంగళవారం కార్యాలయంలో సన్మానించి అభినందించారు.కార్యక్రమంలో డీఏ ఆండాలు, సిబ్బంది ఆజమ్, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



తిప్పర్తి : విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఉద్యోగ విరమణ పొందిన మంగమ్మ దంపతులు

తిప్పర్తి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని హైదరాబాద్ పోలీస్ అకాడమీ సూపరింటెండెంట్ నూకల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రాజుపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నూకల మంగమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి ఉద్యోగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం మంగమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ నాయక్, హెచ్‌ఎం సుశీల, జయరాములు, ఉపాధ్యాయులు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి, గుర్రం రవి, వెంకయ్య, లక్ష్మీనారాయణ, రబ్బాని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ముత్యాలు (ఫైల్)

చిట్యాల: ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. చిట్యాల పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన ఉప్పలపల్లి ముత్యాలు(49) ముంబైలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండేవాడు. అతడి తల్లి అనారోగ్యానికి గురికావడంతో ఆమెను చూసేందుకుగాను పదిహేను రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. డిసెంబర్ 27వ తేదీన తిరిగి ముంబైకి వెళ్లేందుకుగాను స్వగ్రామం నుంచి చిట్యాలకు ఆటోలో తన కుమార్తె కావేరితో కలిసి వెళ్తున్నాడు. ఎలికట్టె గ్రామ శివారులోని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముత్యాలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై చిట్యాల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలం డేగులవాడి గ్రామానికి చెందిన రాథోడ్ సూరజ్‌కుమార్ (28) హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని టెక్రిగోల్డ్ పరిశ్రమ వద్దకు కాగానే వెనుక నుంచి వస్తున్న లారీ సూరజ్ కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.